# కనువిప్పు

నాకు జీవితం మీద విరక్తి పుట్టింది. పుట్టినప్పటి నుంచీ నన్ను అనుసరిస్తున్న పేదరికం మీఒ కసి పెరిగింది. చచ్చి పోవాలని, నిశ్చయించుకున్నాను. గత నలపతి సంవత్సరాలుగా పేదరికంతో పోరాడి ఓడిపోయిన నేను పేదరికాన్ని చచ్చిగెలవాలని అనుకున్నాను.

బీచ్‌లో కూర్చున్నాను.

విశాలమైన సముద్రం జీవిత వ్యధ భరించలేక తలబాదుకొని విలపిస్తోంది. జీవిత పోరాటం సాగించి అలసిపోయిన పడవలు ఒడ్డుకి చేరిపోయాయి.

చీకటి కమ్మిన ఆకాశంలో అక్కడక్కడ కనిపించే నక్షత్రాలలా బీచ్‌లో అక్కడక్కడ వున్నారు జనం. దూరం నుంచి ఒకతను, నా వైపే తదేకంగా చూస్తున్నట్లు అనిపించింది. ఒక్క నిముషం ఆగి దూకితే........

వెనుక విద్యుద్దీపాలతో మిలమిలలాగుతోంది మహానగరం. ఆకాశాన్ని చేతులతో అందుకోటానికి ఆరాట పడుతున్న భవనాలు, నేలమీదకి ఒరిగిపోతున్న గుడిసల మొహాలకి కప్పిన తెరలలా ఉన్నాయి.

దూరంగా కనిపించే ఆభవనంలో ఏ.సి. గదిలో మెత్తని పరుపుమీద పడుకొని నిద్రపోయివుంటాడు సత్యం.

సత్యం గుర్తుకు వచ్చేసరికి అస్వస్థత ఎక్కువైంది. జీవితం మీద కసి పెరిగింది.

ప్రశాంతంగా గడిచే నా జీవితంలో అలజడి రేపింది సత్యమే. నాకు జీవితం మీద విరక్తి కలగటానికి కారణం అతనే.

సత్యాన్ని జీవితంలో మళ్ళీ చూడకపోతే బాగుండేది అని అనుకున్నాను.

వెనుక స్టేషన్‌లో ఎలక్ట్రిక్ ట్రైను బయలు దేరిన శబ్దం వినిపించింది.

ఆ రోజు సాయంత్రం పార్టుటైము జాబుకోసం వెళుతున్న నాకు ఎదురయ్యాడు సత్యం.

ఊహతెలిసిన రోజుల నుంచి కలసి ఆడుకున్నాము, చదువుకున్నాము, ఐనా సత్యాన్ని పోల్చుకోలేకపోయాను. సత్యం ఎంత మారిపోయాడు !

సత్యమే పకలరించాడు.

"అదేంటిరా అలా చూస్తున్నావ్. నేనేరా సత్యాన్ని"

నోటమాట రాలేదు నాకు. నిజమే అది సత్యమే, గాని ఆవేషమేమిటి ? దర్జా ఏమిటి ! తనతో పాటు పార్టుటైమ్ చేసి బ్రతికిన సత్యమేనా, ఇతను !

వీడు బాగా ఆర్జించి నట్లున్నాడు.

"ఇప్పుడెక్కడుంటున్నావురా ? ఎక్కడ జాబు?"

నేను వుంటున్న సబర్బ్ పేరు చెప్పను.

"నేను మళ్ళీ బోంబే వచ్చి సంవత్సరం అయిపోయిందిరా. వచ్చినప్పటి నుంచీ నీకోసం వెతుకుతూనే ఉన్నాను. మొత్తానికి ఈవేళ కనిపించావు' సత్యం ఆనందం వ్యక్తం చేసాడు.

నేను ఎందుకో అతనితో మాట్లాడలేకపోయాను. నేను అంత వరకు ఎరిగిన సత్యానికి, నా ఎదుట నిలబడిన సత్యానికి ఎంతో తేడా వుంది.

"పదరా యింటికి వెళదాము. ఎన్నేళ్ళకి కనిపించావు?" సత్యం కారు దగ్గరకు నడిచాడు.

కారు డోర్ తెరిచాడు సత్యం. ఏ.సి. కారులో నుంచి చల్లని గాలి మొహానికి తగిలింది.

పరిచితమైన రహదారిలో పరుగెత్తి కారు ఓ అధునాతనమైన భవంతి చేరుకుంది.

ఆశ్చర్యంతో చిత్తయిపోయాను నేను గూర్ఖా సలాము కొట్టాడు. గేటు తీసాడు. కారు పోర్టిలో ఆగింది.

సత్యం వెనుక నడిచేటప్పుడు అది కలో నిజమో అనే అనుమానం వచ్చింది. సత్యం యింత డబ్బు ఎలా సంపాదించాడు.

"అలా చూస్తున్నావేంరా, సూర్యం ! నీకు ఆశ్చర్యంగా వుందా ? ఈ ఇల్లు కొని సంవత్సరం అయింది. పదలోపలికి పద"

"చూడు సూర్యం పదిహేనేళ్ళ క్రితం మనం కలసి వుండే వాళ్ళం గుర్తుందా ?" సోఫాలో కూర్చుంటూ అన్నాడు సత్యం. "అప్పుడు మనం ఎంత బాధపడేవాళ్ళం. సరి అయిన వుద్యోగం దొరకకే కద, నేను బోంబే విడిచి వెళ్ళాను. అదే నాకు మేలు చేసింది"

పనిపిల్ల రెండు కప్పుల్లో "బాదంగీర్" తెచ్చింది.

"తీసుకో" సత్యం అన్నాడు. 'నీకు నాతత్వం తెలుసు కదా? డబ్బు లేనిదే నాకు నిద్రపట్టదు. ఎలాగోలా డబ్బు సంపాదించటం నాకు చిన్నప్పటి నుంచీ అలవాటు".

నిజమే ! చిన్నప్పటి నుంచి కూడా సత్యం డబ్బు మనిషే ! డబ్బే బ్రతుకుని అనుకొనేవాడు.

పదో తరగతి చదివే రోజులవి, క్లాసులో ఒకబ్బాయి తెలుగు పుస్తకం కనబడలేదు. పుస్తకం ఎవరు తీసారో వాళ్ళని బుద్ధిగా యిచ్చేయమన్నారు మేష్టారు. కాని, ఎవరు ముందుకు రాలేదు. అప్పుడు సత్యం ఆ పుస్తకాన్ని రాము సంచిలోంచి తీసి మేష్టారుకి ఇచ్చాడు.

రామాన్ని మేష్టారు కొడుతూవుంటే నాకళ్ళలో నీళ్ళు నిండాయి. రామం చాలా మంచివాడు. అమాయకుడు, చదువు మీద దృష్టేగానీ ఏ అల్లరి పనుల్లోనూ వుండేవాడు కాదు. వాడు పుస్తకం దాచదని తెలుసు నాకు.

సాయంతరం యింటికి వెళ్ళేటప్పుడు సత్యాన్ని అడిగాను. రామం సంచిలో పుస్తకం వుందన్న సంగతి వాడికెలా తెలుసని.

"అదేంటిరా అలా అడుగుతావు ? ఆ పుస్తకాన్ని నేను కదా రామం సంచిలో దాచింది"

షాకుతగిలినట్టయింది నాకు.

"రామంగాడిని కొట్టిస్తే రెండు రూపాయలు యిస్తానన్నాడురా, కరణంగారబ్బాయి, వాడికి, రామానికి పడదట"

అయితే రెండు రూపాయల కోసం సత్యం ఆ పని చేసాడన్నమాట !

"ఏంటిరా సూర్యం అలావున్నావు ఏంటి సమస్య" అడిగాడు. సత్యం.

"ఏమిలేదు. ఒంట్లో అంత బాగోలేదు. మరోసారి వస్తాను".

"అలా వెళితే ఎలా? భోజనం చేసి వెళుదువుగాని"

సత్యం బలవంతంమీద భోజనము చేసాను. కారులో స్టేషన్ దగ్గరదింపాడు. బహుశః యింటి దగ్గర దింపే వాడేమో గానీ, మాయిల్లు, పరిసర ప్రాంతములు సత్యం చూడటం నాకు యిష్టం లేదు. అందుకే స్టేషన్ దగ్గర దిగిపోయాను.

వేగం అందుకుంటున్న కరంటు ట్రైన్ కన్నా వేగంగా పరుగెత్తాయి, నా ఆలోచనలు.

ఎంత వాడయిపోయాడు, సత్యం ! ఈ సత్యమే పదిహేనేళ్ళక్రితం నాతోపాటు గుడిసలో వుండి పార్టుటైమ్ వుద్యోగం కోసం వెతుకుతూ వుండే వాడంటే ఎవరైనా నమ్ముతారా ?

నాకు నామీదే అసహ్యం వేసింది. నాచేతకానితనం మీద, అసమర్థత మీద కోపం వచ్చింది.

ట్రైన్ దిగి బ్రిడ్జి దాటేను. కొండకిందికి నడిచేను. నగరంలో వెలుగులు విరబూసే విద్యుద్దీపాల కాంతి అక్కడ లేదు.

గత పదిహేనేళ్ళలో మొదటిసారిగా ఆ కాలనీ, రోడ్డు యిరుకుగాను, చీకటిగాను వున్నట్లు తోచింది. మొదటిసారిగా మురుకి కాలువలు కంపు కొడుతున్నట్లనిపించింది. రోడ్డుమీద మంచాలు వేసి కొని పడుకొన్న వారిని చూసి అసహ్యం వేసింది.

సత్యమే మెదడులో మెదలుతున్నాడు. ఎంత సంపాదించాడు ! ఎంత దర్జాగా వున్నాడు! బ్రతికితే అలా బ్రతకాలని అనుకున్నాను.

తడక తలుపు తీసాను.

"ఏమండి యింత ఆలస్యం?" నా కోసం ఎదురుచూస్తూ కూర్చున్న నా భార్య కంగారుగా అడిగింది. నేనేమీ అనలేదు.

"ఏమండీ యింకో పార్టుటైమ్ దొరికిందా?" ఆశగ అడిగింది ఆమె.

ఇంకో పార్టుటైమ్! ఇంకో పార్టుటైమ్ అంటే యింకో వంద రూపాయలు ! యింకో వంద వస్తే యింకో పాలపేకట్టు కొనవచ్చని, పాపకి మరో మంచి గౌను కొనవచ్చని ఆమె లెక్కవేస్తున్నది !

పార్టుటైమ్ వుద్యోగాల చుట్టూ తిరిగే బ్రతుకుమీద నాకు కసి పెరిగింది.

రెండు చుక్కా రొట్టెలు ప్లేటులో పెట్టి తెచ్చిబెట్టింది నా భార్య.

సత్యం యింట్లో 'ఫ్రూట్ సలాడ్, బాదంఘీర్‌ల రుచి చేసిన నోటికి ఆ రొట్టెలు నచ్చలేదు. జీవితంమీద ఏర్పడిన కసి అంతా ఆ రొట్టెమీద చూపాను. ప్లేటు విసిరి కొట్టాను.

మూడు నెలలు గడిచిపోయాయి. సత్యాన్ని చూసిన రోజు నా మనస్సులో నాటకు పోయిన అపకర్షతా బోధము, డబ్బు సంపాదించాలనే తపన నన్ను సలుపుకు తింటోంది. ఆ మూడు నెలల్లోను సత్యం ఐదారుసార్లు కలిసాడు నన్ను. కలిసినప్పుడల్లా ఫైవ్‌స్టార్ హోటల్సులో గానీ, అతని యింటిలోగానీ విందు భోజనాలు పెట్టేవాడు.

మంచి వుద్యోగాల కోసం వెదికాను. కానీ నిజాయతీని నమ్ముకొనే వారికి రోజుల్లేవని తెలుసుకోడానికి ఎంతో కాలం పట్టలేదు.

పేదరికంతో రోజూ చచ్చేదానికన్నా ఆత్మహత్యచేసుకోవాలని నిర్ణయించు కున్నాను.

జేబుతడిమి చూసాను. చిరునామా వ్రాసిన కాగితం మర్చిపోలేదు. తడవకుండా వుండటానికి ప్లాస్టిక్ కవరులో పెట్టి జాగ్రత్త పరచి వుంది.

ముందుకి నడిచాను. సముద్రపు నీళ్ళు మోకాళ్లకు తగులుతున్నాయి.

ఇంకా కొన్ని నిముషాలలో నా పేదరికపు బాధలు వదిలిపోతాయి కదానని హాయిగా నవ్వుకున్నాను.

ముందుకి నడిచాను.

ఎవరో చొక్కాపట్టుకొని గట్టిగా లాగినట్లనిపించింది. వెనక్కి తిరిగి చూసాను. సత్యం!

"ఇదేంటిరా సూర్యం! ఇదేంపనిరా?" కంగారుగా అడిగేడు సత్యం.

నేనేమీ అనలేదు.

'పదయింటికి' నా చెయ్యి పట్టుకొని నడిచాడు సత్యం.

కారు సత్యం యిల్లు చేరుకుంది. ఫ్లాస్కులో నుంచి రెండు కప్పుల్లో వేడి కాఫీ పోసాడు.

"నువ్విలా చేస్తావని నేనెప్పుడూ అనుకోలేదురా" కాఫీ సిప్‌చేస్తూ అన్నాడు "జీవితంలో ఎన్నో సమస్యలు వస్తూవుంటాయి. వాటికి చావు ఒక్కటే పరిష్కార మార్గమని అనుకోవటం చాలా పొరపాటు"

సత్యం వైపు చూడలేకపోయాను.

"అయినా నీకేమయిందిరా హాయిగా బ్రతక్క చస్తానంటున్నావు"

"నీకేంతెలుసురా నాబాధలు, నువ్వు ఏమైనా చెప్తావు. నీకేం తెలుసు బ్రతుకు బాధ" ఓర్చుకోలేక పోయాను నేను.

"నా కెందుకు తెలీయిదురా? ఒకప్పుడు నీతో బ్రతికిన వాడినేకదరా?" సత్యం లేచి ఓ స్టేట్ ఎక్స్‌ప్రెస్ సిగరెట్ అందించాడు.

'నిన్ను మళ్ళీ కలిసినప్పటి నుంచీ గమనిస్తూనే వున్నాను. నువ్వేమిటి చేస్తున్నావో ఎక్కడ వుంటున్నావో అన్నీ నాకు తెలుసురా. డబ్బు సంపాదించలేక పోతున్నావని, దర్జాగా బ్రతకలేకపోతున్నావని కుమిలిపోతున్నావు కదూ?

గోడమీద గడియారం సత్యం మాటలు శ్రద్ధగా వింటున్నట్లు ఒకసారి ఆగింది. ఆ తర్వాత రెండుసార్లు మ్రోగింది. "నీ బాధ నేనర్థం చేసుకోగలను. కానీ నువ్వు ఒక ముఖ్యమైన విషయం మరచిపోతున్నావు"

"ఏమిటిదీ?"

"బ్రతకటం కోసం డబ్బే గాని, డబ్బే బ్రతుకు కాకూడదు"

నేను గట్టిగా నవ్వేను.

"నువ్వు యిప్పుడు ఏమైనా అంటావు. ఒడ్డెక్కిన వాడివి నువ్వు. మరి నడి సముద్రంలో వున్న వాడిని నేను"

"ఒడ్డేక్కేను గనుకే తెలుసుకున్నానురా. ఒకప్పుడు డబ్బే బ్రతుకని అనుకునే వాడిని, అది నీకూ తెలుసు, అయిన పనీ, కాని పనీ చేసి కోట్లు సంపాదించాను. ఇప్పుడు డబ్బుతో ఏదైనా కొనగలను. గానీ..." సత్యం గొంతు జేవురించింది. 'గానీ, ఆ డబ్బుతో జీవితాన్ని కొనలేకపోయానురా" కర్చీఫ్‌తో కళ్ళువొత్తుకున్నాడు సత్యం.

"చూడు సూర్యం నువ్వు ఎన్నోసార్లు మా యింటికి వచ్చావు, ఎప్పుడైనా పని వాళ్ళని తప్ప యింకెవరినైనా చూసావా?"

నిజమే ! ఆ పెద్ద భవంతిలో సత్యాన్ని, కొందరు పని వాళ్లనీ, తప్ప వేరెవ్వరినీ ఎప్పుడూ చూడలేదు. సత్యం పెళ్ళి చేసుకున్నాడనీ ఇద్దరు పిల్లలనీ చెప్పాడు కదా?

గోడ మీద గడియారం మూడుసార్లు మ్రోగింది. నగరహృదయంలోని అల్ల కల్లోలం కాస్తంత తగ్గినట్లుంది.

పోర్టిలో కారాగిన శబ్దం వినిపించింది.

"ఇదిగో ఇప్పుడు వస్తున్నది మా ఆవిడ. ఆవిడ బ్రతుకు ఆవిడది." సత్యం నిట్టుర్చాడు" ఇంక పిల్లలంటావా హాస్టల్లో చేర్పించేసింది. ఈ యింట్లో నాకూ నావాళ్ళకూ వుండే సంబంధం ఒక్కటే, డబ్బు. ఎవరికి కావలసిన డబ్బు, వారికి సరఫరా చేసే యంత్రమైపోయానురా, నేను" బావురుమని ఏడ్చాడు సత్యం.

ఏమనాలో తోచలేదు, నాకు.

"నువ్వు అదృష్టవంతుడివిరా సూర్యం. ఇంటిలో నీకోసం ఎదురు చూసే భార్య వుంది. నాన్నా, అని ఆప్యాయంగా పిలిచే పాప వుంది" సత్యం కంటి నుంచి కన్నీటి చుక్కలు రాలాయి. 'బోలెడంత సంపాదించాను. కావలసిన వస్తువులన్నీ కొనుక్కోగలను, జీవితానికి అవసరమైన సంతృప్తిని ఐనవాళ్ళ ఆప్యాయతనీ తప్ప"

సత్యం భార్యగాబోలు, విసురుగాలోనికి వచ్చింది. గబగబా మేడ ఎక్కింది. అక్కడ భర్త కూర్చున్నాడని గానీ, ఎవరో అతిథి వున్నాడని గానీ ఆవిడ పట్టించుకోనే లేదు.

ఇదే తన భార్య అయితే యిలా చేస్తుందా! నన్ను చూడగానే ఆమె కంట్లో మెరసే మెరపు నాకు గుర్తుకు వచ్చింది.

పాపం! నా గురించి కంట్లో వత్తులు వేసుకొని కూర్చుని వుంటుంది!

"నేను యింటికి వెళ్ళాలిరా సత్యం!"

"పద యింటిదగ్గర దిగపెడతాను"

కారు పరుగెత్తింది. నగర హృదయం ప్రశాంతంగా వుంది.

"చూసావా సూర్యం, నా భార్యని? ఎవరి ఆప్యాయతకి నేను నోచుకోలేదు. అందుకే అంటున్నానురా మనిషి బ్రతుకుని నడిపించేది డబ్బే కాదని"

బాధ అనిపించింది నాకు. సత్యమేదో దర్జాగా బ్రతుకుతున్నాడని అనుకున్నాను గానీ కడుపులో యింత దుఃఖాన్ని దాచుకున్నాడని అనుకోలేదు.

స్టేషన్‌దగ్గర కారు ఆపమన్నాను. కారు దిగి బ్రిడ్జి దాటి కొండవైపు నడిచాను.

కోలనీలో ఏదో హడావిడిగా వుంది. ఎవరూ నిద్రపోయినట్లు లేదు. ప్రతీ యింట్లోనూ దీపాలు వెలుగుతున్నాయి.

నన్ను చూసిన కుర్రాడొకడు అంకుల్ వచ్చేసాడంటూ పరుగెత్తాడు.

"వచ్చావురా నాయనా నీకోసమే వెదికి చస్తున్నాము" ఆ కోలనీ కల్లా ముసలివాడైన తాత అడిగాడు. "ఇంత ఆలస్యమై పోయిందేమిటి?"

అప్పుడర్థమైంది నాకు, వాళ్ళందరూ నాగురించే ఎదురు చూస్తున్నారనీ, నిద్రమాని వెతుకుతున్నారనీ!

వాళ్ళు ఆప్యాయత నా హృదయాన్ని కదిలించింది.

తప్పుచేసిన వాడిలా తలదించుకొని యింట్లోకి వెళ్ళాను.

"వచ్చేరండీ" పాపని ఒళ్ళో పెట్టుకొని వీధివైనే చూస్తూ కూర్చున్న నా భార్య అంది. "నేనెంత కంగారుపడ్డానండీ" ఆమె ఏడ్చేసింది.

ఒక్కరోజు ఆలస్యమైతే నాగురించి యింత మంది బాధపడుతున్నారా? పార్టు టైము ఉద్యోగాలు చేస్తూ తిని, తినక బ్రతికే నా మీద జనానికి యింత ప్రేమా ?

ఆత్మహత్య చేసుకొని వుంటే..... నా హృదయం కదిలిపోయింది. కళ్ళు తడిసాయి. ఈ ఆప్యాయత, ఈ అనుబంధమే జీవితాన్ని నడిపించేదని సత్యం చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి.

చొక్కావిప్పి గాలికోసం బయటకి వచ్చాను. చీకటి పొరలు తొలగిపోయి వెన్నెల విరిసిన ప్రపంచం అందంగా కనిపించింది, నాకు.

(అంజలి - జూలై 94)